క్లుప్తంగా

ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వాలి

పులివెందుల రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని నూరుబాషా మాజీ కార్పొరేషన్ చైర్మన్ రసూల్ అన్నారు. శనివారం దూదేకుల సంఘ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 2014లో ఎన్డీఏ ప్రభుత్వం తిరుమల వెంకటేశ్వరస్వామి సాక్షిగా ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తానని చెప్పి మూడు దఫాలుగా కేంద్రంలో అధికారంలోకి వచ్చినా ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వకుండా నాటకాలు ఆడుతున్నారన్నారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇస్తే రైల్వే జోన్, విశాఖ ఉక్కుతో పాటు పరిశ్రమలు, ప్రాజెక్టు పూర్తై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెం.1గా నిలుస్తుందన్నారు. ప్రత్యేక హోదా ఇస్తే రాష్ట్ర రూపురేఖలు మారి రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందన్నారు. అలాగే రాష్ట్ర విభజనలోని అంశాలను నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం అభివృద్ధికి కృషి చేయండి

వేంపల్లె : గండిదేవస్థానం అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటసుబ్బయ్య దేవస్థానం అభివృద్ధికి కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్‌లు కోరారు. శనివారం గండి దేవస్థానంలో వారు అసిస్టెంట్ కమిషనర్‌ను కలిసి గండి క్షేత్రంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై దృష్టి సారించి అలాగే ఆలయ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఆయనను కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కేసరి నాగరాజా, దంపెట్ల హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యాకిట్‌లు పంపిణీ



మాట్లాడుతున్న ఎంఈఓ శివప్రసాద్

ఎర్రగుంట్ల : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఈ ఏడాది ప్రభుత్వం అందించిన విద్యాకిట్‌లను మండల విద్యాధికారి శివప్రసాద్ శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి మంచి మార్కులు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రామాంజనేయరెడ్డి, ఇతరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతను గుర్తించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి ఒక్కరూ వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతను గుర్తించాలని హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్న లత సూచించారు. శనివారం కడప నగరం నాగరాజుపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ సెంటర్ ఏరియాలోని పాత రిమ్స్‌లో ×వ్యాధినిరోధక టీకాల ప్రాముఖ్యత్షై అవగాహన కల్పించారు. ప్రసన్నలత మాట్లాడుతూ తల్లులు, అప్పుడే పుట్టిన బిడ్డ నుండి రెండు సంవత్సరాలలోపు చంటి బిడ్డలకు డ్యూ డేట్ ప్రకారం వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో హోమియో ట్రైనింగ్ వైద్యులు డాక్టర్ అనూష, రవి శంకర్ స్నేహా , గ్రీష్మ, శ్వేత, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల పోస్టర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

మైదుకూరు : మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్ల పోస్టర్లను శనివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో మంచి ఫలితాలను సాధిస్తున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి ఎమ్మెల్యేకు వివరించారు. సుజిత అనే విద్యార్థిని 10కి 10 జీపీఏ సాధించి యూనివర్సిటీ ప్రథమ ర్యాంకు సాధించినట్టు చెప్పారు. కళాశాలను 2008లో ఏర్పాటు చేసినా ఇప్పటికీ శాశ్వత భవనాలు లేవని, కళాశాల అభివృద్ధికి చొరవ చూపి కృషి చేయాలని ప్రిన్సిపాల్ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కళాశాలకు సొంత భవనాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, అధ్యాపకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుభాన్ సాహెబ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

బద్వేలు అర్బన్ : స్థానిక సిద్దవటం రోడ్డులోని ఫైర్ ఆఫీసు వెనుక భాగంలో ఉన్న శ్రీమహాలక్ష్మి, గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి, అభయాంజనేయస్వామి ఆలయ నవమి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. ఆరు రోజుల పాటు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, అంకురార్పణం, గరుడపట ఆదివాసం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు వల్లంకొండు వెంకటరమణ, సెక్రటరీ అంకయ్య, ప్రధాన అర్చకులు వీరేశాచార్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా ఏరువాక గంగమ్మతల్లి వార్షికోత్సవం

ఎర్రగుంట్ల : పట్టణంలో వేలసిన ఏరువాక గంగమ్మ తల్లి 27వ వార్షికోత్సవ వేడుకలు శనివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో కోలాటం, నాట్య ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉదయం నుంచి మహాగణపతి పూజ, కలశస్థాపన, అమ్మవారికి పంచామృత అభిషేకం, కుంకుమార్చన పూజలు జరిగాయి. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



ఏరువాక గంగమ్మతల్లి



గ్రామోత్సవంలో గంగమ్మతల్లి



కోలాటం నిర్వహిస్తున్న మహిళలు

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

ప్రొద్దుటూరు : విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని బీజేపీ ప్రొద్దుటూరు అసెంబ్లీ కోకన్వీనర్ పర్లపాడు గౌరీశంకర్ తెలిపారు. శనివారం వివిధ కళాశాలలకు చెందిన 30 మంది విద్యార్థులు ఏబీవీపీ ప్రొద్దుటూరు విభాగంలో సభ్యత్వం తీసుకున్నారు.

ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ భాగ్ కన్వీనర్ శరణ్ కుమార్, నగర కార్యదర్శి శివనారాయణ, నగర సహాయ కార్యదర్శి శివాజీ, హాస్టల్ కన్వీనర్ శ్రావణ్‌కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ సోహెల్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



వంటశాలను పరిశీలిస్తున్న వైద్యురాలు రేష్మా, సిబ్బంది

తొండూరు : మండలంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలను, గురుకుల వసతి గృహాన్ని శనివారం వైద్యాధికారి రేష్మా తన సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసతి గృహంలో విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. అలాగే మరుగుదొడ్లను, వంట గదులను, విశ్రాంతి గదులను, వంటశాల ప్రదేశాలను, మంచినీటి వసతులను పరిశీలించారు. పరిశుభ్రత విషయంలో చర్యలు చేపట్టాలని, ఆరోగ్య సమస్యలుంటే ఆసుపత్రికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, ఆరోగ్య సిబ్బంది, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీసీ, రిజిస్ట్రార్‌లకు ఘన సత్కారం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలను వైవీయూ అధ్యాపక సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. శనివారం పదవులకు రాజీనామా చేసిన వీరిరువురు విశ్వవిద్యాలయం అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆచార్యులు ఏజీ దాము, పుత్తా పద్మా, ఎస్. ఈశ్వరరెడ్డి, వై. సుబ్బరాయుడు, ఎ. మధుసూధన్‌రెడ్డి, ఎన్.సి. గంగిరెడ్డి, కె.ఎస్.వి. కృష్ణారావు, సహ ఆచార్యులు డా. సుబ్రమణ్యంశర్మ, లక్ష్మీప్రసాద్, సుబ్బారెడ్డి, లాజర్, లలిత, అనుప్రసన్న, వెంకట్రాముడు, సుభోష్‌చంద్ర, వసుగోవర్ధన్‌రెడ్డి, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

కడప కార్పొరేషన్: కడప నగరపాలక సంస్థలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు సుంకరి రవి, కె. తిరుపాల్ కోరారు.

శనివారం వారు కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవిని కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాసాపేట రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేయాలని, చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీధర్ బాబు, ఐ. ప్రకాష్, సుంకర కిరణ్, నాగరాజు, రమేష్, నాయక్, ఎస్. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ తప్పనిసరి

కడప అగ్రికల్చర్: ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరికీ పదవీ విరమణ అనేది తప్పని సరి అని, కాకపోతే ఉద్యోగం చేసినంతకాలం ఎంతమేర ప్రజలకు సేవ చేశామనేది ముఖ్యమని జాయింట్ కలెక్టర్ గణేష్ అన్నారు. కడప జిల్లా ఉద్యానశాఖ అధికారిగా పనిచేసిన మైఖేల్‌రాజీవ్ శనివారం పదవీ విరమణ చెందారు. ఆయన పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని కడపలోని జిల్లా పరిషత్తు సమావేశ మందిరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సభకు జేసీ గణేష, రిటైర్డ్ అడిషినల్ ప్రిన్సిపల్ సెక్రటరీ చల్లప్ప, రిటైర్డ్ హార్టికల్చర్ జేడీ లక్ష్మిరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు, జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, డీసీఓ సుభాషిని, డీఎం ఆగ్రోస్ విజయ్ కుమార్, డ్వామా పీడీ యదుభూషన్‌రెడ్డి, మార్క్‌ఫెడ్ పీఎం పరిమళజ్యోతి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ గణేష్ మాట్లాడుతూ మైఖేల్ రాజీవ్ మండల ఉద్యానశాఖ అధికారి నుంచి అంచెలంచెలుగా పదోన్నతులు పొందుతూ జిల్లా ఉద్యానశాఖ అధికారి స్థాయికి వచ్చారన్నారు. ఈయన 33 ఏళ్ల సర్వీసులో రైతులకు ఎన్నో సేవలందించారని కొనియాడారు. ఇతర అతిథులు మాట్లాడుతూ అంకిత భావంతో మైఖేల్ రాజీవ్ విధులు నిర్వర్తించారని కొనియాడారు. అనంతరం మైఖేల్‌రాజీవ్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల డీహెచ్ఓ నాగరాజు, తిరుపతి డీహెచ్ఓ దశరథరామిరెడ్డితోపాటు జిల్లాకు చెందిన పలువురు అధికారులతోపాటు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి రూట నాయకుల వినతి

కడప ఎడ్యుకేషన్: జిల్లావ్యాప్తంగా ఉన్న ఉర్దూ పాఠశాలల సమస్యలను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఇర్షాద్, ప్రధాన కార్యదర్శి జాకీర్ హుస్సేన్‌లు కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డిలను కోరారు. ఈ విషయమై శనివారం కడపలో వారిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలను అందించాలన్నారు. ఉర్దూ ఉపాధ్యాయుల అన్ని పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రూట నాయకులు అబ్దుల్ హకీమ్, సిరాజుద్దీన్, అఫ్జల్‌బాష, మహమ్మద్ అయుబ్, ఫకృద్దీన్, ఖాజామైనుద్దీన్, షాబుద్దీన్, జుబేర్ ఆహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంధోత్సవం



స్వామి వారి మజార్ వద్ద ఫాతెహ నిర్వహిస్తున్న భక్తులు

కమలాపురం : మండల పరిధిలోని కోగటం గ్రామంలో వెలసిన శ్రీ సయ్యద్ షా ఆలంపీర్ స్వామి వారి గంధోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి నిర్వాహకులు కీ.శే. గండ్లూరి పెద్దవీరారెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి ఆధ్వర్యంలో గంధోత్సవం నిర్వహించారు. శ్రీ లక్ష్మయ్యశెట్టి నివాసం నుంచి గంధంను ప్రత్యేకంగా అలంకరించిన చాందినిలో దర్గా వరకు ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపు డప్పు వాయిద్యాలతో, బాణా సంచా పేల్చుతూ పంచరంగుల విద్యుద్దీపాల అలంకరణలో గంధోత్సవం నిర్వహించారు. ఊరేగింపులో యువత వివిధ రకాల నృత్యాలు చేశారు. గంధం దర్గా చేరుకున్న అనంతరం స్వామి వారి మజార్‌పై ఎక్కించారు. పూల చాదర్లు సమర్పించారు. ప్రత్యేక ఫాతెహ నిర్వహించి మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం భక్తులకు గంధం పంచి పెట్టారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

జమ్మలమడుగు : నియోజకవర్గంలోని ఆయా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సుల సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి శనివారం దేవగుడిలోని తన నివాసంలో వినతిపత్రం అందించారు. కాంట్రాక్ట్ నర్సులు మాట్లాడుతూ చాలా కాలంగా తాము నర్సులుగా విధులు నిర్వహిస్తున్నామని ఇంత వరకు ఏ ప్రభుత్వం తమని రెగ్యులర్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇప్పటికైనా ఎన్‌డీఏ ప్రభుత్వం కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వారు ఎమ్మెల్యేను కోరారు.

ఘనంగా జాతీయ గణాంక దినోత్సవం

వైవీయూ: కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో శనివారం జాతీయ గణాంక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ మాట్లాడుతూ ఆధునిక కాలంలో దత్తాంశం ప్రాధాన్యత ప్రతి రంగంలో పెరిగిందన్నారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకట్రావ్ మాట్లాడుతూ విధానాల రూపకల్పనలో దత్తాంశం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎం. రమేష్, డా. ఎస్. సుందరం, సత్యనారాయణ, సుబ్బిరెడ్డి, విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూజలు

కడప కల్చరల్ : కడప నగర సమీపంలోని మగ్దూమ్ సాహెబ్ కొట్టాల గ్రామంలో గల శ్రీ ఇష్టకామ్యార్థ కాలభైరవస్వామి మందిరంలో శనివారం కాలాష్టమి సందర్భంగా విశేష పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ సంప్రదాయ పూజల్లో భాగంగా గుమ్మడికాయను స్వామికి సమర్పించి వాటిపై దీపాలను వెలిగించి హారతులు ఇచ్చారు. అర్చకులు కాలభైరవ స్తోత్రం, అష్టోత్తర శత నామావళి నిర్వహించారు.

అతిసార వ్యాధిపై జాగ్రత్తలు తీసుకోవాలి



విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ హెచ్‌ఈ షఫీఉన్నిషా బేగం

వేంపల్లె : ప్రస్తుత సీజన్‌లో అతిసార వ్యాధిపై ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని తాళ్లపల్లె పీహెచ్‌సీ హెచ్‌ఈ షఫీఉన్నిషాబేగం సూచించారు. శనివారం స్థానిక దళితవాడలోని ప్రాథమిక పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు చేతులు పరిశుభ్రంగా ఉంచాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. అలాగే ఏవైనా ఆరోగ్య సమస్యలు వస్తే సమీప ఏఎన్‌ఎంలను సంప్రదించి సరైన చికిత్స పొందాలన్నారు. వ్యాధులు దరిచేరకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత ఎంతో ముఖ్యమన్నా రు. అనంతరం సీహెచ్‌ఓ వెంకటరత్నం దోమల ని యంత్రణకు తగిన సలహాలు, సూచనలు చేశారు. వాటి ద్వారా వచ్చే వ్యాధి లక్షణాలను వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోవిందు, ఉపాధ్యాయురాలు శ్రీవాణి, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, సీహెచ్‌ఓ రాణి, ఏఎన్‌ఎం లక్ష్మీదేవి, ఆశా తదితరు లు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వాటర్ క్యాన్‌లు వితరణ



వాటర్‌క్యాన్‌లను అందజేస్తున్న విశ్రాంతి టెలికాం డీఈ సుబ్బారావు

పులివెందుల టౌన్ : పట్టణంలోని వికలాంగుల నెట్‌వర్క్ కార్యాలయంలో దివ్యాంగులకు హెలెన్ కెల్లర్ స్మారకార్థం విశ్రాంతి టెలికాం డీఈ సుబ్బారావు వాటర్‌క్యాన్‌లను వితరణగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1880లో అమెరికాలో జన్మించిన హెలెన్ కెల్లర్ అంధురాలు, బధిరురాలు అయినప్పటికీ ఆత్మవిశ్వాసంతో అత్యున్నత స్థాయికి ఎదిగి ప్రపంచంలోనే మొట్టమొదటి దివ్యాంగ గ్రాడియేట్‌గా ఘనత వహించారన్నారు. కార్యక్రమంలో వికలాంగుల నెట్‌వర్క్ అధ్యక్షుడు రఘునాథరెడ్డి, ప్రోగ్రాం ఆర్గనైజర్ వాసు, ఆశా, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రధాన లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ఎర్రగుంట్ల : మున్సిపల్ పరిధిలో అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా పనిచేస్తామని వార్డులలో ఏ చిన్న సమస్యలు వున్నా వాటిని వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అన్నారు. శనివారం ఎర్రగుంట్ల మున్సిపల్ అత్యవసర కౌన్సిల్ సమావేశం మున్సిపల్ చైర్మన్ ఎం. హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజకీయాలకు సంబంధం లేకుండా కౌన్సిలర్లు వారి వార్డులలోని అభివృద్ధి పనులపై దృష్టి పెట్టాలన్నారు. పనులకు కావాల్సిన నిధులు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రధానంగా మున్సిపల్ పరిధిలోని తాగునీటి సమస్య ప్రధాన లక్ష్యంగా తీసుకుని పరిష్కరిస్తామన్నారు. వార్డులలోని తాగునీటి సమస్యలపై కౌన్సిలర్లు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే వార్డులలో నీటి సమస్యలను పరిష్కరించాలని మళ్లీ వచ్చే సమావేశంలో కౌన్సిలర్లు ఈ సమస్యలను అడగకుండా చూసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆయన ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు, జనరల్ ఫండ్ నిధులను వినియోగించుకోవాలన్నారు. కడప రోడ్డులోని జాతీయ రహదారిలో నీరు నిలబడకుండా తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణయ్య, నేషనల్ హైవే శాఖ అధికారులను ఆయన ఆదేశించారు. వార్డులలోని పనులు ఆ వార్డు కౌన్సిలర్లు చేసుకోవచ్చని, ఈ పనులు నామినేషన్ కింద మంజూరు చేయిస్తామన్నారు. వార్డులలో అభివృద్ధి పనులను మీరు చేయకపోతే నేను మా వాళ్లతో నామినేషన్ పనులు చేయిస్తామన్నారు. దానికి మీరందరు తీర్మానం చేయాలన్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటుకు స్థలంను కూడా చూస్తున్నామన్నారు. గండికోట రిజర్వాయర్ నుంచి సుమారు వంద కోట్లకు పైగానే ప్రత్యేక పైపులైన్ వేయిస్తామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈ కిరణ్‌కుమార్, పబ్లిక్ హెల్త్ డీఈ, ఏఈలు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టిసారించాలి



పరిశుభ్రత బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

పులివెందుల టౌన్ : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టిసారించాలని ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. శనివారం చేతుల పరిశుభ్రతపైన విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఖాజామొయిద్దీన్ మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్యంపై దృష్టిసారించాలన్నారు. మరుగుదొడ్లను ప్రతీరోజు రెండుసార్లు శుభ్రం చేయించాలన్నారు. ప్రతీరోజు భోజనానికి ముందు చేతులను శుభ్రం చేసుకోవాలన్నారు. పాఠశాలల్లో స్వచ్ఛత కార్యక్రమం అమలు అయ్యేలా చూడాలన్నారు. పాఠశాలలో ఉపాధ్యాయులు రెండు గ్రూపులుగా ఏర్పాటు చేసుకుని పరిశుభ్రత అంశాన్ని ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలని చర్చించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీబీఎస్ఐ జిల్లా సమన్వయకర్తలు, స్నేహిత అమృతహస్తం సేవాసమితి అధ్యక్షుడు రాజు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

డయేరియా రాకుండా ముందస్తు చర్యలు

ప్రొద్దుటూరు క్రైం : డయేరియా రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. స్థానిక సంజీవనగర్‌లో డయేరియా క్యాంపెయిన్, సీజన్ వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డీఎంహెచ్ఓ మాట్లాడుతూ జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ జరుగుతుందన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలను గుర్తించి డయేరియా ఉంటే ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని చెప్పారు. పిల్లల్లో డయేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెంది తద్వారా వ్యాధులు వస్తాయని తెలిపారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు కుట్టకుండా దోమతెరలను వాడాలని సూచించారు. జ్వరం వస్తే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి, డాక్టర్ దినేష్, అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్స్ వెంకటేశ్వర్లు, శోభారాణి, సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, సీఓలు సుబ్బారెడ్డి, నాగజ్యోతి పాల్గొన్నారు.

రాచాయపేటలో డయేరియా

గోపవరం : మండలంలోని రాచాయపేటలో వాంతులు, విరేచనాలు (డయేరియా)తో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ముందుగా జ్వరం రావడం, వాంతులు, విరేచనాలు రావడంతో పలువురు మంచం పట్టారు. ఎప్పటికప్పుడు తాగునీటి పథకాలు శుభ్రం చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో ఉన్న తాగునీటి పథకం (ఓహెచ్ఆర్)కు నిచ్చెన లేకపోవడంతో పరిశుభ్రత ప్రశ్నార్థకంగా మారింది. నెలల తరబడి ట్యాంకు పరిశుభ్రతకు నోచుకోకపోవడంతో ఆ నీరే స్థానికులు ఉపయోగిస్తుండటం వల్ల డయేరియా వ్యాధితో స్థానికులు మంచం పడుతున్నారు. అనేక మార్లు మంచి నీటి పథకానికి నిచ్చెన ఏర్పాటు చేయాలని స్థానికులు సంబంధిత అధికారులకు తెలిపినా పట్టించుకున్న దాఖలాలు లేవు. మూడు నెలలకు ఒకసారి ట్యాంకులు తప్పనిసరిగా శుభ్రం చేయాల్సి ఉంది. మండల వ్యాప్తంగా 20 ఓవర్ హెడ్ ట్యాంకులు ఉండగా వీటిలో 5 ట్యాంకులకు నిచ్చెన లేవని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ తెలిపారు. అంతేకాకుండా గ్రామంలో కోతులు కూడా అధికంగా ఉండటంతో ట్యాంకులలో దిగడంతో నీరు కలుషితమవుతున్నాయి. ఇదే నీటిని స్థానికులు వివిధ అవసరాలకు ఉపయోగించుకుంటున్నారు. దీంతో వ్యాధులు కూడా ప్రబలే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తాగునీటి పథకాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయడంతోపాటు నిచ్చెన లేని ట్యాంకులకు మరమ్మతులు చేపట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

లోక్ అదాలత్‌తో సత్వర పరిష్కారం

కమలాపురం కోర్టు పరిధిలో 74 కేసులు పరిష్కారం

కమలాపురం : లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయ సేవలు పొందడంతో పాటు కేసులను సైతం సత్వరం పరిష్కారం చేసుకోవచ్చని కమలాపురం జూనియర్ సివిల్ కోర్టు మెజిస్ట్రేట్ ఎస్.లావణ్య తెలిపారు. శనివారం జరిగిన నేషనల్ లోక్ అదాలత్‌లో భాగంగా స్థానిక కోర్టులో లోక్ అదాలత్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇరువర్గాలు రాజీ ధోరణిలో ఉన్న 74 కేసులు పరిష్కరించినట్లు కోర్టు వర్గాలు తెలిపాయి. ఇందులో 364 క్రిమినల్, 6 సివిల్, 4 బ్యాంక్ కేసులు పరిష్కారం అయినట్లు వారు తెలిపారు. కాగా మెజిస్ట్రేట్ కక్షిదారులను చేతులు కలిపి రాజీ చేయించారు. అనంతరం వారిని ఉద్దేశించి మెజిస్ట్రేట్ లావణ్య మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పైసా ఖర్చు లేకుండా కేసులను సత్వరం పరిష్కరించు కోవచ్చన్నారు. రాజీ ధోరణిలో ఉన్న కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే తర్వాత పై కోర్టుల్లో అప్పీలు చేసుకునే అవకాశం కూడా ఉండదన్నారు. ముఖ్యంగా సమస్యలున్నవారు కక్షిదారులు కక్ష్యలు, కార్పణ్యాలకు వెళ్లకుండా గ్రామ పెద్దల ఎదుట తమ సమస్యలను పరిష్కరించు కోవచ్చన్నారు. లేని పక్షంలో పోలీసులు, కోర్టు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవడం మంచిదన్నారు. రాజీ మార్గం.. రాజ మార్గం అని కక్షిదారులు రాజీ ధోరణికి వచ్చి తమ కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు, పోలీస్ సిబ్బంది, కక్షిదారులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు : లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జడ్జి

జమ్మలమడుగు : పెండింగ్‌లో ఉన్న కేసులన్నీ లోక్ అదాలత్ ద్వారా ఎటు వంటి ఖర్చు లేకుండా బాధితులు, కక్షిదారులు పరిష్కరించుకోవచ్చని జూనియర్ సివిల్ జడ్జి భార్గవి తెలిపారు. శనివారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆమె మాట్లాడారు. ప్రజలు చిన్న చిన్న కారణాల ద్వారా గొడవలు పెట్టుకుని పోలీస్‌స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరగడం వలన కాలయాపన, డబ్బు ఖర్చులతో కూడుకున్నది. ఇరువురు రాజీపడి కేసులను పరిష్కారం చేసుకుంటే ఇద్దరు గెలిచినట్లే అని వివరించారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ లక్ష్మయ్య, పీపీ వీరాంజనేయులు, ఏజీపీ జాకీర్ హుసేన్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవగుడి నారాయణరెడ్డి, సెక్రటరీ మురళీధర్‌రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.